పొత్తూరి విజయలక్ష్మి

కథ

# ఈ-పార్టీ

ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తోంది.

"అమ్మా నేను ఏదైనా గొప్ప పని చేద్దామనుకుంటున్నా" అన్నాడు శ్రీధర్.

"అయ్యో అంతకంటేనా? గొప్ప పనులు చెయ్యడం మీ వంశంలోనే ఉందిగా. మీ తాతగారు ఎంత పాత వస్తువైనా పారెయ్యకుండా రిపేర్లు చేయించి వాడుకునేవారుట. మీ నాన్నగారేమో ఏదైనా అనారోగ్యం వచ్చినా మందులేసుకునే వారు కారు. నాల్రోజులు చూసి ఇక వీడు లొంగడని విసుగేసి రోగం కాస్తా పారిపోతుంది అనేవారు. నువ్వూ ఏదైనా చెయ్యి" కొడుకుని ప్రోత్సహించింది పార్వతి.

లోపల్నుంచి వచ్చింది సుజాత. "ఏమండీ వాన పడుతుందిగా బజ్జీలు చెయ్యనా పకోడీలా" అని అడిగింది.

"అవన్నీ తర్వాత చూద్దాంలే. మీ ఆయన ఏదో గొప్ప పనిచేస్తాడుట. కూచో. అదేవిటో విందాం" అంది పార్వతి.


"మా ఆయనా? గొప్ప పనా?" ఆశ్చర్యపోయింది సుజాత.

"అవును సమాజానికి పనికొచ్చేలా ఏదైనా చెయ్యాలని ఉంది" అన్నాడు.

"ఏడిసినట్లు ఉంది. బజార్కెళ్లి కూరలు తెమ్మంటే అబ్బ పోదూ ఈ పూటకి కంది పచ్చడీ పచ్చిపులుసూ చేసెయ్ అని బద్ధకించే మీరు సమాజ సేవ చేయాల్సిందే" అనేసి లోపలికి వెళ్లిపోయింది.

"అదలాగే అంటుందిలేరా! నువ్వేం పట్టించుకోకు. కూరలు తేనంత మాత్రాన ఇంకెందుకు పనికిరాడంటే ఎట్లా?" అంది పార్వతి.

సుజాత బజ్జీలు తెచ్చేసరికి బుర్ర బద్దలుకొట్టుకుంటున్నాడు శ్రీధర్. సమాజానికి మంచి చెయ్యాలంటే బర్నింగ్ ప్రాబ్లం ఏదైనా తీసుకుని దాన్ని సాల్వ్ చేసే దిశలో ప్రయత్నం చేయాలి. తనొక్కడే ఆలోచించడం కంటే అందరూ కలిసి ఆలోచించడం మంచిది కాబట్టి భార్యనీ తల్లినీ కూడా తన కమిటీలో వేసుకున్నాడు.




ముగ్గురూ బజ్జీలు తింటూ అనేకానేక సమస్యల గురించి చర్చించుకున్నారు. సమస్యలు చాలానే ఉన్నాయి. కానీ పరిష్కారం తన పరిధిలో ఉండాలిగా. చాలా తీవ్రంగా ఆలోచించగా ఓ ఆలోచన తట్టింది శ్రీధర్‌కి.

"అమ్మా ఈ-పార్టీ అనే పద్ధతి ప్రవేశపెడతా!" అన్నాడు.

"పిచ్చి సన్నాసీ! టీ పార్టీ నువ్వు కొత్తగా ప్రవేశపెట్టినట్టు! అదేనాటి నుంచో ఉంది. నేను పుట్టినప్పుడే ముగ్గురు మగపిల్లల తర్వాత పుట్టానని మా తండ్రిగారు ఇచ్చారుట టీ పార్టీ" నవ్వింది పార్వతి.

"అబ్బ... టీ పార్టీ కాదు ఈ పార్టీ ఈపార్టీ" చెప్పాడు.

అత్తాకోడళ్లు మొహామొహాలు చూసుకున్నారు. వాళ్లకు ఏమీ అర్థం కాలేదని అర్థమైంది శ్రీధర్‌కి.

"వివరంగా చెప్తా వినండి. ఇందాక మనం బోలెడు సమస్యల గురించి

చర్చించుకున్నాం. అందులో ఒకటి ఫంక్షన్లకెళ్లడం కదా!'' అడిగాడు.

''అవు(నా నాయనా. తల్చుకుంటేనే వెన్ను లోంచీ వణుకు పుట్టుకొస్తోంది'' అంది పార్వతి.

''నిజమేనండీ. ఎవరైనా దర్జాగా తయారై శుభ లేఖలు కట్ట పుచ్చుకొని ఇంటికొస్తే చాలు. కడుపు లోంచీ దుఃఖం తన్నుకొస్తోంది'' అంది సుజాత.

''ప్రజల్ని వేధిస్తున్న అనేకానేక సమస్యల్లో ఇదొకటి'' అంటూ గొంతు సవరించుకొని ఉపన్యాసం ప్రారంభించాడు శ్రీధర్.

''ఈ నగరం నలుమూలలకీ విస్తరించిపోతోంది. అందరూ తలా మూలా ఉంటారు. పేరుకి ఒకే ఊరన్న మాటేగానీ ఒక చోటు నుంచి ఇంకో చోటుకి వెళ్లాలంటే పొరుగూరి ప్రయాణం కంటే ఎక్కువైపోతుంది.

మరి ఇంట్లో ఏ శుభకార్యం తలపెట్టినా నలుగుర్నీ పిల్చుకోవడం మన ఆనవాయితీ. మొన్న మొన్నటిదాకా అంతా బాగానే ఉండేది. ఏదైనా శుభకార్యం వస్తే బోలెడంత సంబరపడిపోయేవాళ్లు. ఊర్నిండా బంధువులు. అందరిళ్లకీ వెళ్లలేం. ఇలా వేడుకల్లో అందర్నీ ఒకే దగ్గర కలుసుకోవచ్చు. కష్ట సుఖాలు మాట్లాడుకోవచ్చు అని బయలుదేరే వాళ్లు. రా(నానూ పద్ధతి మారిపోయింది. ఎవరైనా పిలిస్తే చాలు చచ్చాం అనుకుంటున్నారు'' అన్నాడు.

''అవు(నా అబ్బాయ్. భయం వేస్తోంది. ఎక్కడికైనా వెళ్లాలంటే'' అంది పార్వతి.

''పిల్లలు ఫంక్షన్స్‌కి రావడం ఎప్పుడో మానేశారు. పెద్దవాళ్లం ఏడుస్తూ మొత్తుకుంటూ వెళ్తున్నాం'' అంది సుజాత.

''పోనీ వెళ్లిన చోట నలుగురూ చేరి సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారా అంటే అదీ లేదు. ట్రాఫిక్ కష్టాలు ఏకరువు పెట్టేసరికే పుణ్యకాలం కాస్తా ముగిసిపోతోంది.

ఆరింటికి బయలుదేరాం ఇంట్లో. ఇదుగో ఎనిమిదింటికి చేరాం. భయంకరంగా ఉంది ట్రాఫిక్. అందులోనూ మీ అమీర్‌పేటా, పంజాగుట్టా అదెప్పుడూ దారుణంగానే ఉంటుంది'' అని ఊరుకుంటే 'భలేవారే. మా దిల్‌షుక్ నగరూ, ఉప్పలూ మాత్రం తక్కువా. మీకంటే కాస్త ఎక్కువగానే ఉంటుంది' అంటారు మరొకరు. చాల్లెండి మీరెంత గొంతు చించుకున్నా మీ కూకట్ పల్లి తర్వాతనే ఎవరైనా. సాయంత్రం నాలుగింటికి గుక్కెడు కాఫీ తాగి బయలుదేరి ఇదిగో ఇప్పుడొస్తున్నాం అని పోటీలు పడి చెప్పుకుంటారు'' అన్నాడు శ్రీధర్.

''అంతేగా మరి! దార్లో పడ్డ కష్టాలు చెప్పుకుని భోంచేసి మళ్లీ తిరుగు ప్రయాణం'' అంది సుజాత.

''ఎప్పుడెప్పుడు వెళ్లి కొంపలో పడదామా అనిపిస్తుంటే ఇంకా కబుర్లేం చెప్పుకుంటాం'' అంది పార్వతి.

''ఈ కష్టాలు సీజన్ని బట్టి మారిపోతాయి. చలికాలం అయితే అబ్బే సీజనేం బాగాలేదండీ. వారం రోజులుగా మా ఇంట్లో అందరికీ కాఫూ కోల్డూ! ఇక్కడ గార్డెన్‌లో పెళ్లి. ఇంటికెళ్లి ఏ జ్వరమో కాసి పడకెయ్యడం ఖాయం'' అంటాడో పెద్దమనిషి.

''మా చంటాడికీ ఆస్త్మా ప్రాబ్లం. ఇక్కడికొచ్చి ఐస్‌క్రీం తింటాడు. వద్దురా అంటే వినడు. వాడిదేముందిలెండి మనమే టెంప్ట్ అయిపోతాం ఐస్‌క్రీం చూసి. ఈ పెళ్లి పుణ్యమా అని నాల్రోజులు అవస్థ పడాలి అని మరొకాయన వాపోతాడు'' అన్నాడు శ్రీధర్

''చలికాలమే నయం. ఎండాకాలం అయితే మరీ దారుణం. మాడి మసైపోతాం. బయట గాలి పొయ్యిలా ఉంటుంది. దానికి తోడు ఆరుబయటే కారు పార్కింగ్. కారు ఫర్నేస్‌లా అయిపోతుంది. ప్రాణాల్తో కొంపకి చేరుతామా అనిపిస్తుంది. ఏ.సి. ఏ మూలకి ఆ వేడికి'' సుజాత చెప్పింది.

''అన్నట్లు మీకు చెప్పానో లేదో ఆ మధ్య మా సుందరి ఓ ఉపాయం చెప్పిందిరా! వాళ్లు ఎండాకాలంలో పెళ్లిళ్లకెళ్తూ ఓ అరడజను తువ్వాళ్లు తీసుకెళ్తారుట'' గుర్తు వచ్చింది పార్వతికి.

''తువ్వాళ్లా? ఎందుకుటా?'' అడిగింది సుజాత.

''పెళ్లిపందిట్లో ఐస్‌వాటరు అడిగి తీసుకుని అందులో ఈ తువ్వాళ్లు తడిపి పిండుకుని స్టీరింగు మీదొకటీ గేరుమీదొకటీ వేస్తారుట. అందరూ తలా తడితువ్వాలూ నెత్తిమీద కప్పుకుని బయలుదేరతారట. ఈ తువాళ్లు ఆరిపోయేలోగా కారు కాస్త చల్లపడుతుంది. లేకపోతే ఇంటికెళ్లేసరికి వడదెబ్బ తగలదా వదిన అంది మా సుందరి'' చెప్పింది పార్వతి.

''ఇదేదో బాగానే ఉందిగా. ఈసార్నించీ మనమూ ఆ పనే చేద్దాం. ఏది ఏమైనా ఎండాకాలం పెళ్లిళ్లు చేసే వాళ్లని జైల్లో పెట్టాలి'' అంది సుజాత.

''అవును. అయితే వర్షాకాలం బావుంటుందా!'' నవ్వుతూ అడిగాడు.

''ఇంకానయం. మన నగరం చినుకుపడితే చాలు వెనీస్ నగరంలా మారిపోతోంది. వర్షాకాలం పెళ్లికెళ్లడం అంటే భోరున ఏడుస్తున్నారు జనం. పాపం ఆమధ్యన మా గిరీవాళ్లు పెళ్లికెళ్తుంటే జోరున వాన. ఆటో కాస్తా ఆగిపోతే అందరూ దిగిపోయారుట. భార్యాపిల్లల్ని పక్కన నడిచి రమ్మని తనూ ఆటో డ్రైవరూ ఆటో నెట్టుకుంటూ, మెరకమీదికొచ్చాక ఆటో రిపేరు చేసుకుని వచ్చారు పాపం పెళ్లి మండపానికి'' చెప్పింది సుజాత.


''ఎందుకంత అవస్థ? ఆ ఆటో వదిలేసి వేరే ఆటో ఎక్కచ్చుగా!'' శ్రీధర్ అడిగాడు.

''ఆ మాత్రం తెలివితేటలు లేక కాదు. వాళ్లున్న ఏరియాకి పట్టపగలే రారు ఆటోవాళ్లు. ఇక రాత్రిపూట వస్తారా? అందుకే దొరికిన ఆటోనే రానూపోనూ మాట్లాడుకున్నారుట. అలా మాట్లాడుకున్నాక మధ్యలో ఎలా వదిలేస్తారు? అందుకే నెట్టుకొచ్చాడు మా గిరి!'' చెప్పింది.

''అమ్మాయ్! మీ గిరి అంటే వయసులో ఉన్నాడు. ఆటో ఏం ఖర్మ. అవసరం వస్తే లారీ

## మరో రీమేక్

**త**మిళంలో సూర్య హీరోగా నటించిన 'సింగం' పెద్ద హిట్టయింది. ఇదే సినిమా తెలుగులోకి 'యముడు'గా డబ్బింగ్ అయి విజయాన్ని సాధించింది. ఇప్పుడీ సినిమాని హిందీలో నిర్మించడానికి సన్నాహాలు జరుగుతున్నాయిట. హిందీలో గోల్‌మాల్ సీరీస్‌ని తీసిన దర్శకుడు రోహిత్ షెట్టి యముడు హిందీ వెర్షన్‌ని రూపొందించే ప్రయత్నాల్లో వున్నాట్ట. అతని సినిమాల్లో రెగ్యులర్ హీరో అజయ్ దేవ్‌గన్ ఈ హిందీ సింగంలో నాయకుడుగా నటించే అవకాశాలే ఎక్కువగా వున్నాయని సినీజనాల ఉవాచ.



అయినా నెట్టగలడు. మరి పాపం మా రాముడు నాలుగేళ్ల కిందట రిటైరైన వాడు. కార్లో వాడూ వాడి భార్య వస్తుంటే మూత తీసుంచిన మేన్‌హోల్‌కి ముందు చక్రం దిగిపోయిందట. రాముడికి గుండె దడా, ఆయాసం. వాడి పెళ్లానికి కాళ్ల నెప్పులూనూ. వాళ్లేం తొయ్యగలరు చెప్పు? కారు దిగి ఏడుపు మొహాలు వేసుకుని ఆ వానలో నిలబడిపోతే ట్రాఫిక్ పోలీసొచ్చి వీళ్లని నాలుగు తిట్టి నలుగుర్నీ కేకేసి కారు తీయించాడుట. కాందిశీకుల్లా వచ్చారు పాపం కల్యాణమండపానికి. బుద్ధొచ్చింది పార్వత క్కయ్యా! ఇక జన్మలో ఏ పెళ్లికీ రాను అన్నాడు'' అంటూ మరో అనుభవం చెప్పింది పార్వతి.

''అవును పాపం. అసలైనా వానాకాలం పెళ్లిళ్లేమిటీ బుద్ధీ బుర్రా లేకుండా అనీ వానాకాలం పెళ్లి చేసేవాళ్లని జైల్లో పెట్టాలి'' ఆవేశంగా అంది సుజాత.

నవ్వేశాడు శ్రీధర్. ''మరి ఏ కాలంలోనూ పెళ్లి చేసుకోవద్దంటే అందరూ ఏ గంగలో దూకాలి?'' అన్నాడు.

''ఆ మాటా నిజమే'' అంది అయోమయంగా సుజాత.

''పెళ్లికి వెళ్లే వాళ్ల బాధలు ఇలా ఉంటే పెళ్లిచేసే వాడి పనీ దారుణంగానే ఉంటోంది. బోలెడంత ఖర్చు పెట్టి శుభకార్యం చేసినా ఏం సుఖం? దర్జాగా తయారై నిలబడి వచ్చిన వాళ్లని వచ్చారా రండి అని పలకరించడానికి భయం అవచ్చాం. చచ్చి సత మతం అయ్యాం అని కరవొస్తుంటే ఏదో చెయ్యరాని పని చేసినట్లూ తలొంచుకోవాల్సి వస్తోంది కదా పాపం'' అన్నాడు శ్రీధర్.

''మరెలా ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి?'' అంది సుజాత.

''ఈ-పార్టీ'' చెప్పాడు.

''ఈ పార్టీ అంటే?'' ముక్తకంఠంతో ప్రశ్నించారు అత్తాకోడళ్లు.

''ఈ పార్టీ అంటే ఈ మెయిలూ ఈ సేవా లాగా అన్నమాట. నగరాన్ని పది పన్నెండు జోన్లుగా విభజించాలి. ఆయా జోన్లలో ఉన్న హోటల్ వాళ్లంతా చర్చించి ఓ ఒప్పందానికి రావాలి. వాళ్ల దగ్గర వీళ్ల శక్తిని బట్టి ఫుడ్ కూపన్లు తీసుకుని శుభలేఖలతో బాటుగా ఈ కూపన్లు పంపించాలి. ఇంత దూరం మీరెలాగా రాలేరు కాబట్టి ఫలానా హోటల్లో భోంచేసి మమ్మల్ని ఆశీర్వదించండి అనెయ్యాలి. ఎలా వుంది నా ఐడియా?'' అన్నాడు.

''ఏడిసినట్లు ఉంది. పిలిస్తే పిలవాలి. లేకపోతే మానెయ్యాలి. అంతేగానీ మా ఇంట్లో శుభకార్యం. మీరు హోటల్లో తినండి అంటే తిట్టిపోస్తారు'' విసుక్కుంది సుజాత.

''ఏం తిట్టరు. మొదట్లో ఆశ్చర్యపోయినా తర్వాత అసలు విషయం గ్రహించి ఆనందిస్తారు''

పార్వతి మాత్రం అలా కొట్టిపారెయ్యలేదు. ఆవిడకి కొడుకు తెలివితేటల మీద బోలెడంత నమ్మకం.

''అవునే సుజాతా! ఈ బఫే భోజనాలొచ్చిన కొత్తల్లో ఏవిటీ పీడాకారం. ఇంత బతుకూ బతికి ప్లేటలు చేతబుచ్చుకుని అన్నాలు తినడం ఏవిటి అని విసుక్కున్నారు. ఆ తర్వాత అదే అలవాటై పోలా! ఇప్పుడు కాసేపాగండి వడ్డిస్తారట అని చెప్పినా ఎవరూ ఆగటం లేదు. ఎవరు ఆగుతారు ఏదో కాస్త తినిపోతే సరిపోతుంది అనుకుంటున్నారు. ఇదీ అంతే'' అంది.

''మరి అలా చేస్తే మనుషులు ఒకరితో ఒకరు కలవడమే ఉండదు కదా! ఈమాత్రం సంబంధాలు కూడా ఉండకపోతే ఎలా?'' మరో సందేహం వచ్చింది సుజాతకి.

''కలవకుండా ఎందుకుంటారు? ఏ ఏరియా వాళ్లు ఆ ఏరియాలో హోటల్లో కలుస్తారుగా. రమణగారబ్బాయి పెళ్లికి మాకు నారాయణగుడా తాజ్ కూపన్లు పంపించారు. అంటే మాకు అబిడ్స్ తాజ్‌వి పంపారు. సుశీలగారికి తాజ్ ట్రైస్టార్ సికింద్రాబాద్ కూపన్లుట అని చెప్పుకుంటారు. టెక్నాలజీ డెవలప్ అవుతుంది కాబట్టి అక్కడ జరిగే వేడుక అన్ని హోటళ్లలోనూ చూసే ఏర్పాటు కూడా చేయొచ్చు. మన చాదస్తం గానీ ఇపుడు మాత్రం పెళ్లెవరు చూస్తున్నారు? రిసెప్షన్‌కి వచ్చి భోంచేసి పోతున్నారు. ఒకవేళ ముహూర్తం టైముకి వచ్చినా వీడియో వాళ్ల వీపులు తప్ప పెళ్లి ఎవరికి కనిపిస్తోంది?'' అన్నాడు శ్రీధర్.

''అవన్నీ సరే అనుకోండి. మరి అలా పెళ్లి చేసేస్తే చదివింపులూ, కట్నాలూ రావు కదా. అంతా ఖర్చే తప్ప రాబడి ఉండదు కదా!'' నసిగింది సుజాత.

''దానికో ఉపాయం ఆలోచించే వుంచా. కార్డులో అడ్రెస్సూ, సెల్ నెంబరుతోబాటు అకౌంట్ నెంబరూ ఇచ్చేస్తే సరిపోతుంది. మొహమాటం ముందు పుట్టి తర్వాత మనం పుట్టాం. కాబట్టి ఇప్పుడు డబ్బు కవర్లో పెట్టి ఇచ్చినట్లే అప్పుడూ ఆ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేసేస్తారు. వధూవరులకు కానుకలివ్వకుండా భోజనం చేయడం భావ్యం కాదు. గృహస్తులకి క్షేమం కూడా కాదు అని అర్థం వచ్చేలా శ్లోకం ఒకటి తయారుచేయించి కార్డులో ఓ మూల వేయించేస్తే ఇక ఢోకా ఉండదు. అందరూ ఎవరిదారిన వాళ్లు కూపన్లు తీసుకుని హోటళ్లకి పోతే ఇక పెళ్లింట్లో సందడే ఉంటుందిరా అబ్బాయ్?'' అంది పార్వతి.

''ఎందుకుండదూ! దగ్గర బంధువులంతా ఎంత దూరం అయినా వస్తారు. ఆ జోన్ వాళ్లే వస్తారు. పెళ్లి తిరణాల లాగా కాకుండా పెళ్లిలాగా ఉంటుంది. అందరూ దగ్గర్లో హోటల్లో భోంచేస్తూ గతంలో చిక్కడపల్లి నుంచీ శంకరపల్లికీ, వనస్థలిపురం నుంచీ గచ్చిబౌలికి శుభకార్యాలకు పోయే వాళ్లుట పిచ్చిసన్నాసులు అని చెప్పుకుంటారు'' అన్నాడు.

''చూడబోతే మీ ఆలోచన క్లిక్ అయ్యేలాగానే ఉందండోయ్!'' అప్పటికి నమ్మకం కుదిరింది సుజాతకి.

''మరైతే ఈ పథకం మీద మరింత కృషి చేసి రేపు నీ పిల్లల పెళ్లిళ్లకి ఈ-పార్టీలే ఇవ్వరా అబ్బాయ్. నేను మెచ్చుకుంటాను'' అంది పార్వతి.

☆



## దటీజ్ సోనూ!

**బాలీవుడ్ సింగర్ సోనూ నిగమ్ ఈమధ్య సరికొత్త ప్రయోగం చేశాడు. అదేంటంటే- రాబోయే 'తీస్‌మార్ ఖాన్' అనే సినిమా కోసం ఏకంగా 54 గొంతులతో పాట పాడాడు. హీరో హీరోయిన్లయిన అక్షయ్ కుమార్-కత్రినాలకి సూటయ్యే విధంగా మేల్ ఫిమేల్ వాయిస్‌లతో పాటు కోరస్‌లోనూ కొంతమందికి సూటయ్యేలా గొంతులు మార్చి మొత్తం 54 మంది గాయకులు పాడినట్టుగా పాడాడట. ఇది విన్న వాళ్లంతా సోనూ టాలెంట్‌ని తెగ ప్రశంసిస్తున్నారు.**